పార్కు అభివృద్ధిపై అలసత్వం

గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిన వైనం



గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయిన సత్యనగర్ పార్కు

- నామ మాత్రంగా వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- చిన్నారులకు ఆట పరికరాలూ కరువు
- పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు
- ఇదీ సత్యనగర్ కాలనీ పార్కు దుస్థితి

నాగోలు: ప్రజల ఆరోగ్య సంరక్షణ, ఆహ్లాదం లక్ష్యంగా లక్షలాది రూపాయలు వెచ్చించి జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత వాటి అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో వృథాగా మారుతున్నాయి. కొత్తపేట డివిజన్‌లోని సత్యనగర్ కాలనీ పార్కు దుస్థితే ఇందుకు నిదర్శనం.

◆ 2019లో రూ. 12.50 లక్షలు వెచ్చించి సత్యనగర్‌లో పార్కు ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ పార్కులో నామమాత్రంగా వాకింగ్ టైల్స్‌తో ట్రాక్ నిర్మించి చుట్టూ ప్రహరీ తీసి వదిలేశాడు.

◆ చిన్న పిల్లల కోసం పేరుకు కొన్ని ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కు అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో పార్కులో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో స్థానికులు వాకింగ్ చేసుకొనే పరిస్థితి కూడా లేకుండాపోయింది. నిర్వహణ లేకపోవడంతో ఇక్కడి టాయిలెట్స్ నిరుపయోగం మారాయి.

◆ గడ్డి, పిచ్చి మొక్కలు పెద్ద ఎత్తున పెరిగిపోవడం, మూసీ దగ్గర ఉండటంతో విష సర్పాలు లాంటివి ఎక్కడ తమను కాటు వేస్తాయోనని భయంతో కాలనీవాసులు పార్కులో వాకింగ్ చేసే సాహసం చేయడం లేదు.

◆ అంతేకాకుండా రాత్రి సమయంలో పోలీసులు ఇటువైపు రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి యువకులు వచ్చి పార్కులో మద్యం, మాదకద్రవ్యాలు సేవిస్తూ ఘర్షణ పడుతూ గోల గోల చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

◆ ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు సత్యనగర్ కాలనీలో పార్కుపై దృష్టి పెట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. పార్కులోని గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు అందరికీ ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

భద్రత పెంచాలి..



సత్యనగర్ కాలనీ మూసీ నది సమీపంలో ఉండటం, పార్కుకు తాళం వేయకపోవడం, పోలీసుల నిఘా లేకపోవడంతో రాత్రి సమయంలో ఇతర ప్రాంతాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో వచ్చి పార్కులో మద్యం తాగుతున్నారు. అధికారులు పార్కు వద్ద భద్రతా చర్యలు తీసుకోవడంతో పార్కును అభివృద్ధి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తేవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, కొత్తపేట

పట్టించుకోవడం లేదు..

సత్యనగర్‌లో పార్కును జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోక పోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో కాలనీవాసులు వాకింగ్‌కు వెళ్లేందుకు జంకుతున్నారు. పార్కు దుస్థితిపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి పార్కును మరింత అభివృద్ధి చేసి స్థానికులు వినియోగించుకొనేలా చూడాలి.

– యాదగిరి, కొత్తపేట



పార్కులో ఎండిన చెట్లకొమ్మలు



వాకింగ్ ట్రాక్‌పై పెరిగిన మొక్కలు, గడ్డి



నిరుపయోగంగా మారిన టాయిలెట్స్

మోదీని అందరూ బలపర్చాలి: ఈటల



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మన్సూరాబాద్: 'ఫిర్ ఏక్ బార్ మోదీ కా సర్కార్' అనే నినాదంతో ప్రతి కార్యకర్త, బూత్ స్థాయి ప్రతినిధులు కష్టపడి పనిచేయాలని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా నాగోలు డివిజన్ పరిధి హరిణ వనస్థలి మన్సూరాబాద్ గేట్ వద్ద వాకర్స్‌ను ఆయన మంగళవారం కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ, డిజిటల్ విప్లవాన్ని సామాన్యునికి అందుబాటులోకి తెచ్చిన ఘనత మోదీ సర్కార్‌దని అన్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మోదీ నాయకత్వాన్ని అందరూ బలపర్చాలని కోరారు. కమలం పువ్వుకు ఓటేసి మల్కాజిగిరి ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, పాదూరి కరుణ, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి



హస్తినాపురం సౌత్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. హస్తినాపురం సౌత్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు బుధవారం కార్పొరేటర్‌ను కలిశారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. దీంతో కార్పొరేటర్ సౌత్‌కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పావని, కాలనీ ప్రతినిధులు ప్రకాశ్, రాంప్రసాద్, ఎస్ఎన్‌రెడ్డి, శ్రీకృష్ణ, హనుమంతరావు, సుమతి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సీజ్



కమలానగర్‌లో హిమాలయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వనస్థలిపురం: ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను వైద్యారోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. వివరాలు... రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు కమలానగర్‌లోని హిమాలయ మెడికల్ హాల్, కంప్లీట్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధరణికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు.ఎలాంటి రిజిస్ట్రేషన్, అనుమతులు లేకుండా గత ఐదేళ్లుగా ఈ సెంటర్ నిర్వహిస్తున్నారని, విలువైన మందులు నిల్వ ఉంచడంతో పాటు ఫస్ట్ ఎయిడ్ పేరుతో చికిత్సలు అందిస్తున్నారని అధికారులు గుర్తించారు. జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ నుంచి అనుమతులు తీసుకున్న తర్వాతే క్లినిక్‌ను నిర్వహించాలంటూ అధికారులు ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను సీజ్ చేశారు. డా.శ్రావణ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాత నేరస్తులు మంచి ప్రవర్తనతో మెలగాలి



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ కృష్ణయ్య, సీఐ రామాంజనేయులు తదితరులు

నాగోలు: పాత నేరస్తులు మంచి ప్రవర్తనతో ఉండాలని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకూడదని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు ఎటువంటి గొడవలు, కొట్లాటలకు వెళ్లొద్దని ఏసీపీ హెచ్చరించారు. పాతనేరస్తులపై పోలీసు నిఘా ఉంటుందని, మంచి ప్రవర్తనతో కుటుంబ సభ్యులతో కలిసి ఉండాలని సూచించారు. ఎలాంటి గొడవలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ సీఐ రామాంజనేయులు, ఎస్‌లు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమి కబ్జా

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘం వినతి

రామంతాపూర్: పరిధిలో కామాక్షిపురంలో నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు దుర్గేష్, ప్రధాన కార్యదర్శి వలిగొండ నారాయణదాసు, కోశాధికారి తుమ్మల రవి కురుమూర్తి కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కామాక్షిపురం వీధి నం.8 ప్లాట్ నం.189లో గల కోట్లు విలువ చేసే 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని తప్పుడు నకిలీ పత్రాలు సృష్టించి గోపాల్ యాదవ్ వీరయ్య, రమేష్, వెంకటేశం, నాగరాజు, మంజుల అనే వ్యక్తులు కబ్జా చేసినట్లు వారు వెల్లించారు. ఈ విషయాన్ని ఉప్పల్ పోలీసులకు సంక్షేమ సంఘం నేతలు ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదు చేసి వీరయ్య, రమేష్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో నలుగురు పరారీలో ఉన్నారన్నారు. ఉప్పల్ పోలీసులు పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ భూములు కాపాడేందుకు తాము చేస్తున్న పోరాటానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్లు సహకరించాలని వారు కోరారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 11, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 60, కాకర 35, బీర 35, క్యాబేజీ 25, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 23, దొండ 23-28, చిక్కుడు 23-50, గోకర 40, బీట్‌రూట్ 17. క్యాప్సికం 60, ఆలు 27, దోస 18, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 50. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నిరుద్యోగుల దీక్ష భగ్నం

చైతన్యపురి: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో చైతన్యపురిలో నాలుగు రోజులుగా నిరుద్యోగులు చేస్తున్న దీక్షను చైతన్యపురి పోలీసులు భగ్నం చేశారు. జీఓ 46ను రద్దు చేయాలని, గ్రూప్ పోస్టులు పెంచాలని, టెట్ నిర్వహించాలని నిరుద్యోగులు కొందరు దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే.కాగా, దీక్ష చేస్తున్న అశోక్‌తో పాటు మరికొందరిని చికిత్స కోసం బుధవారం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

కార్పొరేషన్‌తో 30 లక్షల మంది పద్మశాలీలకు భరోసా



పున్న గణేష్ నేత

దిల్‌సుఖ్‌నగర్: పద్మశాలీల సంక్షేమం, అభివృద్ధి కోసం పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు, ఆర్‌కేపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉన్న కార్పొరేషన్లు కేవలం చేనేత ఆధారంగా ఉన్న పద్మశాలి, చేనేత కుటుంబాలకు మాత్రమే మేలు జరిగిందన్నారు. పద్మశాలి జనాభాలో అత్యధిక శాతం వృత్తి వెలుపల ఉన్నారని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వాలను అభ్యర్థిస్తూ వచ్చామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వృత్తి వెలుపల ఉన్న పద్మశాలీల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్పొరేషన్ వల్ల సుమారు 30 లక్షల మంది పద్మశాలీలకు ప్రభుత్వం ఆదుకుంటుందనే భరోసా కలిగిందన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కవయిత్రి మొల్లమాంబ 583వ జయంతి వేడుకలను ఎల్‌బీ నగర్ రింగ్ రోడ్డు చౌరస్తాలో ఎల్‌బీ నగర్ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి మాట్లాడుతూ , తెలుగు ప్రజలకు రామాయణాన్ని సులభ శైలిలో అందించిన మహోన్నత మహిళ మొల్లమాంబ అని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు రాణించాలని కోరారు. సంఘం నేతలు తీగుళ్ల ఉపేందర్, ఎస్.అంజయ్య, ఎస్.శ్రీనివాస్, రామనాథం, నారాయణ, సూర్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భర్తే చంపేశాడు!

యాచకురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 10న జరిగిన యాచకురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. భర్తే ఆమెను గొంతు కోసి చంపేశాడని గుర్తించి బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సరూర్‌నగర్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన తుసమ్మరే బసంత్‌సింగ్ కూలీ పని చేసుకుంటూ జీవిస్తుటాడు. ఎల్‌బీనగర్ పరిసరాల్లో చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవించే జ్యోతితో పరిచయం ఏర్పడి ఇద్దరూ కలిసి జీవిస్తున్నారు. బసంత్‌సింగ్,జ్యోతిల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. జ్యోతిపై అతను అనుమానం వ్యక్తం చేస్తుండేవాడు. ఇదిలా ఉండగా, ఈనెల 10వ తేదీ రాత్రి ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయం సమీపంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందున్న ట్రాఫిక్ కాంపౌండ్ బూత్ పక్కన జ్యోతి నిద్రపోయింది. మద్యం మత్తులో ఉన్న బసంత్‌సింగ్ ఆమె గొంతు కోసి హత్య చేసి పరారయ్యాడు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీసులు ఎల్బీనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు జ్యోతిని హత్య చేసిన బసంత్‌సింగ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. కాగా, నిందితుడిపై ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లతో పాటు నగరంలోని పలు పోలీసుస్టేషన్లలో పలు దొంగతనం కేసులు ఉన్నాయని తెలిసింది. బసంత్‌సింగ్ అప్పుడప్పుడు సైకోగా ప్రవర్తిస్తుంటాడని, ఇప్పటికే వివిధ కేసుల్లో జైలుకెళ్లి వచ్చాడని భగత్‌సింగ్‌నగర్ కాలనీవాసులు పేర్కొన్నారు.

మాజీ సీఎం బూర్గులకు ఘన నివాళి



బూర్గుల రామకృష్ణా రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్

చాదర్‌ఘాట్: హైదరాబాద్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు జయంతి వేడుకలు బుధవారం మలక్‌పేట ఏ బ్లాక్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గల రామకృష్ణారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పటేల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంట్ల కృష్ణ, ఆకుల రాజు,రామారావు తదితరులు పాల్గొన్నారు

ఎంఎస్‌ఎంఈ పథకాలపై అవగాహన

మలక్‌పేట: మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) బాలానగర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం దిల్‌సుఖ్‌నగర్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో వ్యవస్థాపకతపై అవగాహన సదస్సు (ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్)నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈ డీఎఫ్ఓ, అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి మాట్లాడుతూ, కొత్త వ్యవస్థను స్థాపించే స్ఫూర్తి నింపేలా యువత భావితరాలను చైతన్య పర్చాలన్నారు. ఎంఎస్‌ఎంఈ పథకాల గురించి తెలియజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. 59 మంది ఎస్టీ విద్యార్థులు, 13 ఉపాధ్యాయులతోపాటు మొత్తం 117 మంది సదస్సుకు హాజరయ్యారు. కార్యక్రమంలో మహతి ఎంటర్‌ప్రైజ్ ప్రొప్రైటర్ బి. హరిత, స్టార్టప్ కన్సల్టెంట్ అకాడమీ ఆఫ్ స్టార్టప్ సుధీర్ శర్మ, కెనరా బ్యాంక్ ఏజీఎం సునీత్ ఝా, అవంతి విద్యాసంస్థల హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, డైరెక్టర్ సాయిరామ్, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఏఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు రెడ్డి సంఘం కృతజ్ఞతలు



బద్దూరి వెంకటేశ్వరరెడ్డి

చైతన్యపురి: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై తెలంగాణ రెడ్డి సంఘం కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రేవంత్‌రెడ్డి తన హామీని నిలబెట్టుకున్నారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో లక్ష మంది రెడ్డి కులస్తులతో సీఎంకు కృతజ్ఞత తెలుపుతూ సభ నిర్వహిస్తామని బద్దూరి ప్రకటించారు.

కార్పొరేషన్ తో నిరుపేద ఆర్య వైశ్యులకు న్యాయం జరుగుతుంది



ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ఆర్య వైశ్య కార్పొరేషన్‌ను ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పేద ఆర్య వైశ్యులు అభివృద్ధి చెందాలంటే వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గమని అన్నారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి వైశ్యుల 40 ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చారని శ్రీనివాస్ గుప్తా అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో తెలంగాణాలో ఉన్న నిరుపేద ఆర్య వైశ్యులందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు.

వీడియోలు పోస్టు చేసిన కార్పొరేటర్‌పై ఫిర్యాదు



సీఐ కాశీవిశ్వనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న మమత

మీర్‌పేట: వాట్సాప్ గ్రూపుల్లో అవమానించేలా వీడియో పోస్టు చేసిన బీజేపీ కార్పొరేటర్‌పై బీఆర్ఎస్ కార్పొరేటర్ మమత స్థానిక నాయకులతో కలిసి బుధవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన మేయర్ అవిశ్వాసానికి సంబంధించి నమ్మించి మోసం చేశారని బీజేపీ కార్పొరేటర్ నీలారవినాయక్ తన వాట్సాప్ స్టేటస్‌లో, వాట్సాప్ గ్రూపుల్లో తమ పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్ల వీడియోను పోస్టు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వీడియోను పోస్టు చేసి కార్పొరేటర్ల పరువుకు భంగం కలిగించిన కార్పొరేటర్ నీలారవినాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు నవీన్‌గౌడ్, సిద్దాల బీరప్ప, అనీల్‌యాదవ్, ఇతర నాయకులు ఉన్నారు.

నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నందిగామ మైత్రి ప్రియ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని పలు సంస్థలు, కార్యాలయాల్లోని 150 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, బీఈడీ విద్యార్హతతో పాటు 18 ఏళ్లు పైబడినవారు అర్హులు. ఎంపికైన వారికి వారి విద్యార్హత, నైపుణ్యం ఆధారంగా ఆకర్షణీయమైన జీతభత్యాలు ఉంటాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటలకు ఫోటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 83284 28933.

'పది'కి సర్వం సిద్ధం

- రంగారెడ్డి జిల్లాలో పరీక్షలు రాయనున్న 50,946 మంది విద్యార్థులు
- 239 కేంద్రాల్లో నిర్వహణ
- పోలీసుల నిఘాలో ప్రశ్నపత్రాలు



విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

హుడాకాంప్లెక్స్: ఈ నెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 50,946 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో బాలురు 26,492, బాలికలు 24,454 మంది, ప్రైవేటుగా మరో 1012 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తంగా 239 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 239 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 237 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను, 41 మంది అడిషనల్ అధికారులను, 9 మంది ఫ్లయింగ్ స్క్వాడ్లు, 239 మంది సిట్టింగ్ స్క్వాడ్లు విధుల్లో ఉంటారు. సరూర్‌నగర్ మండల పరిధిలో కర్మన్‌ఘాట్ పాఠశాలలో 143, బహదూర్‌గూడలో 147, రాజీవ్‌గాంధీనగర్ 66, చంపాపేట 79, సరూర్‌నగర్ 212, మన్సూరాబాద్ 29, సరూర్‌నగర్ ఉర్దూ మాధ్యమ పాఠశాల నుంచి 17 మంది పరీక్షలు రాయనున్నారు. సరూర్‌నగర్ మండల పరిధిలో 44 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతి ప్రశ్నాపత్రాలు ఈ నెల 12న కేంద్రాలకు అందుబాటులోని పోలీస్‌స్టేషన్లకు చేరాయి. పటిష్ట భద్రత నడుమ వాటిని భద్రపరిచారు. ఉత్తీర్ణత పెంపునకు చర్యలు, గత సంవత్సరం కంటే ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో విద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత నాలుగు నెలలుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది విద్యార్థులు సైన్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు సాధించారు. ఈ ఏడాది ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దారు. పరీక్ష రాసేటప్పుడు విద్యార్థులకు గాలి, వెలుతురు ఉండేలా పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



కందుకూరు మండలంలోని 4 పరీక్షా కేంద్రాలు, బాలాపూర్ మండల పరిధిలో 19, మహేశ్వర మండల పరిధిలో 9, సరూర్‌నగర్ పరిధిలో 44 పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాం. ప్రశ్నా పత్రాలు ఆయా కేంద్రాలకు సమీపంలోని పోలీస్‌స్టేషన్లకు చేరుకున్నాయి. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం..

– కృష్ణయ్య, మండల విద్యాధికారి

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



అమరవాది లక్ష్మీ నారాయణ

మలక్‌పేట: ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్ లోని హైద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..మహాసభ విజ్ఞప్తి మేరకు, ఆర్య వైశ్య కార్పొరేషన్ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చడమే కాకుండా కామారెడ్డి ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చి మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకం అన్నారు. ఆర్య వైశ్యుల చిరకాల కోరిక నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు మహాసభ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా ఉపేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలు, ఆయన అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేద విద్యార్థులకు నోట్ బుక్స్, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహన సేవలో శ్రీవారు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం హనుమంత వాహనంపై శ్రీనివాసుడు శ్రీరామచంద్రమూర్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం గజ వాహనంపై వెంకటేశ్వరస్వామిని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, స్నపన తిరుమంజనం అర్చన, సల్లింపు, ఆస్థానం, ఏకాంత సేవ తదితర పూజాదికాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యురాలు జి. సీతారెడ్డి, టీటీడీ ఎల్ఏసీ వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.